# 32 వ అధ్యాయము

# గృహనిర్వాహకత్వము

యేసు కొండమీది ప్రసంగపు అధ్యాయములో ఆయన తన శిష్యులతో గృహ నిర్వాహకత్వము మీద పలికిన మాటలను గూర్చి పరిశీలించుము. భూమి మీద గాక, పరలోకములోనే మీ ఆస్తిని కూడబెట్టుమని ఆయన వారితో అనెను. చరాస్థుల మీద పెట్టుబడిచేయువారి బుద్ధిహీనతనే కాదుగాని, వారి హృదయాంతరాళములో యున్న అంధకారమును గూర్చి కూడా ఆయన ఎత్తి చూపించెను.

భూమి మీద కూడబెట్టు వారికి ద్రవ్యమే వారికొక దేవుడు. ఎందువలన అనగా వారు దానిని సేవించెదరు. అది వారి జీవితములను ఏలును. దేవుని ద్రవ్యమును ఒకసారి సేవించుట అసాధ్యమని యేసు పలికెను. కారణమేమనగా దేవుడు మన నిజమైన యజమాని అయినచో మన యావదాస్తికిని ఆయన యజమాని. ***మానవుల హృదయాల కొరకు ద్రవ్యమే దేవునితో ఎక్కువగా పోటీపడుతుంది.*** అందువలననే మన యావదాస్తులను విసర్జించనిదే ఆయన శిష్యులము కామని యేసు బోధించాడు (లూకా 14:32 చూడుము). క్రీస్తు శిష్యులు ఏమీ కలిగివుండరు. వారు కేవలము దేవునికి సంబంధించినవాటికి గృహనిర్వాహకులు మాత్రమే మరియు దేవుడు తన గుణగణములను ప్రతిబింబించుటకు మరియు ***ఆయన*** రాజ్యవిస్తరణకు పాటుపడుటకు తన డబ్బులు వాడబడుటను ఇష్టపడతాడు.

యేసు గృహనిర్వాహకత్వమును గూర్చి చెప్పుటకు ఇంకా అనేక విషయములు కలిగి ఉన్నాడు, కాని ఆయన అనుచరులమని చెప్పుకుంటున్నవారు తరచూ ఆయన మాటలను లెక్క చేయనట్లుగా అగుపడుతోంది. ఈ మధ్య కాలములో బాగా ప్రాముఖ్యమైన విషయం ఏమిటనగా లేఖనములను వక్రీకరించి అందులోనుంచి “భాగ్యవంతమైన జీవితం అనెడి సిద్ధాంతమును” సృష్టించి దానిని ఎన్నో రూపాలలో చలోక్తులతో ఆకట్టుకునేలా చెబుతుంటారు. కాని శిష్యులను చేయు సేవకుడు, క్రీస్తు ఆజ్ఞలన్నిటినీ పాటించమని ప్రజలకు చెబుతూ వారు ఆ ప్రకారంగా చేయవలెనని ఆశిస్తుంటాడు. ఆవిధంగా అతడు తన మాదిరి కరమైన జీవితము ద్వారా మరియు ***బైబిలుప్రకారమైన*** గృహనిర్వాహకత్వము గూర్చిన ప్రసంగాల ద్వారా ప్రజలకు బోధిస్తుంటాడు.

లేఖనములు గృహనిర్వాహకత్వమును గూర్చి ఏమిచెబుతున్నాయో పరిశీలిస్తూ అదే సమయములో భాగ్యవంతమైన జీవితం గురించిన తప్పుడు బోధలలో కొన్ని సామాన్యమైన ఉదాహరణలను కూడా పరిశీలిద్దాం. ఇది విపులంగా గ్రహించగలిగే అధ్యాయనం అని అనుకోను, ఎందుకంటే ఈ ఒక్క అంశం మీదే నేను ఒక పుస్తకమును ఆంగ్లములో వ్రాశాను, దానిని మీరు మా వెబ్‌సైట్ (shepherdserve.org)లో చదవగలరు. ఇది “బిబ్లికల్ టాపిక్”(Biblical Topics) అనెడి శీర్షిక క్రింద మరియు “జీసస్ ఆన్ మనీ” (Jesus on Money) అనెడి

ఉపశీర్షిక క్రింద వ్రాయబడివుండుటను కనుగొనగలరు.

## అవసరతలను తీర్చువాడు

పౌలు పరిశుద్ధాత్మ ప్రేరేపణతో, "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19) అని వ్రాసిన సంగతిని మనం జ్ఞాపకం చేసుకుంటూ ఆశాజనకంగా ప్రారంభిద్దాం. ఈ సుపరిచితమైన వాగ్దానము తమకే ఇవ్వబడింది అని తరచూ క్రైస్తవులు చెప్పుకుంటూ ఉంటారు. కాని అది ఏ సందర్భములో చెప్పబడింది? మనము సందర్భానుసారంగా చదివితే ఫిలిప్పీలో ఉన్న విశ్వాసుల అవసరతలు దేవుడు తప్పక తీరుస్తాడు అన్న పౌలు యొక్క ప్రగాఢమైన విశ్వాసానికి గల కారణం మనం తెలుసుకుంటాం:

> అయినను ***నా శ్రమలో మీరు పాలుపుచ్చుకొనినది మంచిపని.*** ఫిలిప్పీయులారా, సువార్తను నేను బోధింప నారంభించి మాసిదోనియలో నుండి వచ్చినప్పుడు ఇచ్చు విషయములోను పుచ్చుకొను విషయములోను మీరు తప్ప మరి ఏ సంఘపువారును నాతో పాలివారు కాలేదని మీకే తెలియును. ఏలయనగా ***థెస్సలొనీకలోకూడ మీరు మాటిమాటికి నా అవసరము తీర్చుటకు సహాయము చేసితిరి.*** నేను యీవిని అపేక్షించి యీలాగు చెప్పుటలేదు గాని మీ లెక్కకు విస్తారఫలము రావలెనని అపేక్షించి చెప్పుచున్నాను. నాకు సమస్తమును సమృద్ధిగా కలిగియున్నది. **మీరు వంపిన వస్తువులు ఎపఫ్రొదితువలన పుచ్చుకొని** యేమియు తక్కువలేక యున్నాను; అవి మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును ఇష్టమునై యాగమునై యున్నవి. కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును (ఫిలిప్పీ 4:14-19).

ఫిలిప్పీయులకు ఉన్న అవసరతలు యేసు ఖచ్చితంగా తీరుస్తాడని పౌలు నమ్మాడు, ఎందుకనగా వారు యేసు యొక్క షరతును పాటించారు: వారు మొదట దేవుని రాజ్యాన్ని వెదికారు. అది వారియొక్క త్యాగపూరితమైన బహుమతుల ద్వార రుజువుచేయబడింది, కనుక పౌలు మరికొన్ని సంఘాలను స్థాపించుటను కొనసాగించగలిగాడు. కొండమీది ప్రసంగంలో యేసు చెప్పినది గుర్తుచేసుకుందాం,

> ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును (మత్తయి 6:32-33).

కాబట్టి, ఫిలిప్పీ 4:19 లో పౌలు యొక్క వాగ్దానమును వల్లిస్తూ అది తమకొరకే

ఇవ్వబడింది అని చెప్పుకొనుచున్న క్రైస్తవులెవ్వరికీ అది చెందదు అనియు దానికన్నా ఎవరైతే దేవుని రాజ్యాన్ని మొదట వెదుకుతారో వారికే ఇది వర్తిస్తుంది అనియు మనం గ్రహించవచ్చు.

## నిజంగా మనకు ఏమి కావాలి?

మత్తయి 6:32-33 లో చెప్పబడిన యేసు వాగ్దానం నుండి మనం నేర్చుకొనవలసినది ఒకటి ఉంది. కొన్నిసార్లు మనము మన అవసరతలు మరియు మన కోరికల మధ్య ఉన్న తేడాను గుర్తించలేకపోతుంటాం. కాని మన అవసరాలు గురించి యేసు చక్కగా నిర్వచించి చెప్పాడు. "ఇవన్నియు మీకు ***అవసరమని*** మీ పరలోకపు తండ్రికి తెలుసు," అని ఆయన చెప్పాడు.

ఆయన రాజ్యాన్ని మరియు నీతిని మొదట వెతుకుతున్నవారికి "అవన్నియు" అనుగ్రహించబడునని యేసు చెబుతున్నవి ఏమిటి? అవి ఆహారం, నీరు మరియు వస్త్రములు. దీనిని ఎవరూ వాదించలేరు, ఎందుకంటే మనం ఇప్పుడు పరిశీలిస్తున్న వాగ్దానమునకు ముందు యేసు దానిగురించి చెప్పాడు కనుక (మత్తయి 6:25-31 చూడుము). ఆహారం, నీరు మరియు వస్త్రములు అనునవి కేవలం మన భౌతిక అవసరతలు. వాస్తవంగా యేసు మరియు ఆయన శిష్యులు కలిగి ఉన్నవి కూడా కేవలం ఇవియే.

మన అవసరతల గురించి యేసు ఇచ్చిన నిర్వచనముతో పౌలు కూడా అంగీకరిస్తు తిమోతికి ఈ విధంగా వ్రాశాడు,

> సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై యున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. ***కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొందియుందము***. ధనవంతులగుటకు ఆపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్షసమస్తమైన కీడులకు మూలము; (1 తిమోతి 6:6-10).

మన భౌతిక అవసరతలు కేవలం ఆహారం మరియు వస్త్రములని పౌలు నమ్మాడు, లేనిచో మనం కలిగి ఉన్న వాటితో సంతృప్తిగా ఉండాలని చెప్పివుండేవాడు కాదు. ఫిలిప్పీయుల యెడల దేవుడు వారి ప్రతీ అవసరమును తీర్చునెడి అతని వాగ్దానము మనలో ఒక భిన్నమైన దృక్పథమును కలిగిస్తున్నది! కొందరు ప్రసంగీకులు ఈ వచనం గురించి విశదీకరించే విధానమును బట్టి, "నా దేవుడు నా ఆశలన్నీ తీరుస్తాడు" అని ఈ వచనం చెబుతున్నట్లుగా మనం అనుకుంటాం. ఇంకను మనం కేవలం ఆహారం మరియు వస్త్రముతో సంతృప్తిగా ఉండాలంటే, మనకు నిజంగా ఇప్పుడు కలిగి ఉన్నవాటితో ఇంకా సంతృప్తిగా ఉండాలికదా? మనలో కొందరికి కేవలం ఆహారం మరియు వస్త్రముకంటే ఇది ఎక్కువ కాదా?

# అసంతృప్తి

మనకు అవసరమైన దానికంటే మరియొక్కువ కావాలి అని కోరుకోవటమే మనకున్న సమస్య. ఆదాము, హవ్వను దేవుడు సృష్టించినప్పుడు వారు ఏమియు కలిగివుండలేదు అయినను వారు పరదేసులో జీవిస్తూ ఉండిన సంగతి ఒకసారి గమనించండి. వాస్తవంగా ఈ భౌతికమైన వస్తుసామాగ్రిని పొందటం ద్వారా మనం ఆనందం పొందడం దేవుని ఉద్దేశ్యం కాదు. యేసు ఒక్క సారికూడా బాత్‌రూమ్‌లో కుళాయిని తిప్పలేదు లేక బాత్‌రూమ్‌లో షవర్ కింద నిలబడలేదు అనే సత్యాన్ని నీవు ఎప్పుడైనా ఆలోచించావా? వాషింగ్ మిషన్‌లో ఆయన తన బట్టలను ఎప్పుడూ ఉతకలేదు; ఫ్రిజ్ తలుపును ఎప్పుడూ తెరవలేదు. కారును ఎప్పుడూ నడపలేదు లేక చివరకు సైకిలు మీద కూడా వెళ్ళలేదు. ఒక్కసారి కూడా రేడియోను వినలేదు, ఫోను మీద ఎవ్వరితో మాట్లాడలేదు, స్టవ్ మీద ఏమీ వండలేదు, పబ్లిక్ సౌండ్ సిస్టమ్ మీద ఎన్నడూ ప్రసంగించలేదు. ఒక వీడియో లేక టి.విని ఎన్నడూ చూడలేదు, ఒక కరెంటు దీపమును వెలిగించలేదు, చల్లదనం కోసం ఎయిర్‌కండిషన్ ముందు లేదా ఫ్యాన్ ముందు ఎప్పుడూ ఉండలేదు. ఒక చేతి గడియారం కూడా ఆయన ఎప్పుడూ కలిగివుండలేదు. ఆయనకు అలమర నిండా బట్టలు లేవు. అయినా కూడా ఆయన సంతోషంగా ఎలా ఉండగలిగాడు?

అమెరికాలో (మరియు బహుశా మీదేశంలో కూడా), తాము క్రొత్తగా పొందిన భౌతికమైన ఆస్తులను అనుభవిస్తూ మనుష్యులు ఎంత సంతోషంగా ఉండేది ప్రకటనలు తరచూ చూపిస్తు ఉంటాయి. దాని వలన, అనేకమంది ఎంత సంపాదిస్తే అంత ఆనందం పొందుతాం అన్న భ్రమలో పడిపోతున్నారు, కాని మనం ఎంత సంపాదించినా సంతృప్తి పొందజాలము. దీనినే యేసు, "ధనమోసము" అని సూచిస్తున్నాడు (మత్తయి 13:22). భౌతిక విషయాలు ఆనందాన్ని యిస్తాయి అని చెప్పబడుతోంది కాని అది చాలా అరుదుగా సంభవిస్తుంటుంది. ఇంకా సంపాదించాలన్న ఈ లోకం వెర్రిలో పడిపోయి, మనం విగ్రహారాధికులమవుతాము, ధనానికి బానిసలవుతాము, దేవుడిని మరియు మన పొరుగువారిని హృదయపూర్వకంగా ప్రేమించాలన్న ఆ ముఖ్యమైన ఆజ్ఞను మనం మరిచిపోతుంటాము. దీని గురించే దేవుడు ఇశ్రాయేలులను హెచ్చరించాడు:

> నేడు నేను నీకాజ్ఞాపించు ఆయన ఆజ్ఞలను విధులను కట్టడలను నీవు అనుసరింపక నీదేవుడైన యెహోవాను మరచి కడుపార తిని మంచి యిండ్లుకట్టించుకొని వాటిలో నివసింపగా, నీ పశువులు నీ గొఱ్ఱె మేకలును వృద్ధియై నీకు వెండి బంగారములు విస్తరించి నీకు కలిగినదంతయు వర్ధిల్లినప్పుడు, నీ మనస్సు మదించి, దాసుల గృహమైన ఐగుప్తుదేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడైన యెహోవాను మరచెదవేమో (ద్వితీ 8:11-14).

అలాగే ఒక నిజమైన విశ్వాసి ఎవరైతే తనకుతాను తన మనస్సును వేరొకదాని మీదికి లగ్నం చేయనిస్తాడో అతను "ధనమోసం" వలన ఈ ఆత్మీయ జీవితం పోగొట్టుకోగలడని

యేసు హెచ్చరించాడు (మత్తయి 13:7, 22 చూడుము). "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6:10) అంటూ పౌలు "ధనపేక్ష సమస్తమైన కీడులకు మూలము" అని చెబుతూ హెచ్చరించాడు. "ధనాపేక్ష లేనివారై మీకు కలిగినవాటితో తృప్తి పొంది యుండుడి. నిన్ను ఏ మాత్రమును విడువను , నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా. కాబట్టి ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము (హెబ్రీ 13:5) అంటూ హెబ్రీయులకు పత్రిక వ్రాసిన గ్రంథకర్త అయిన పౌలు మనకు ఉపదేశిస్తున్నాడు. ధనమువలన వచ్చెడి అపాయము గురించి లేఖనములలో ఉన్న హెచ్చరికల్లో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

## డబ్బే యజమాని అయినప్పుడు

దేవునితో మన సంబంధం ఎలాంటిదో తెలుసుకోవటానికి బహుశా డబ్బుతో మన వ్యవహారమునకు మించిన బారమతి లేదు. డబ్బును సంపాదించుటకొరకు మనము కొంత సమయమును వెచ్చించి కొన్ని పద్ధతుల ద్వారా దానిని పొందుతాం, దానిని పొందాక దానితో ఏమి చేస్తామో అన్నది మన ఆత్మీయ జీవితాన్ని తెలియజేస్తుంది. మనం డబ్బును కలిగి ఉన్న లేదా లేకపోయిన అది మిగతవాటికన్న ఎక్కువ శోధనను ఇస్తుంది. డబ్బు ఆ రెండు గొప్ప ఆజ్ఞలకు వ్యతిరేకముగా నడుచుకునేలా సులభంగా మనలను నడిపించగలుగుతుంది, ఎందుకనగా అది దేవుని కంటే కూడా ఎక్కువ ప్రాధాన్యతను పొంది, మనలను మనము ఎక్కువగా ప్రేమించుకునేలా మరియు పొరుగువారిని తక్కువ ప్రేమించేలాగా చేస్తుంది. మరోపక్క దేవునికి మరియు మనపొరుగువారికి మన ప్రేమను నిరూపించటానికి డబ్బు ఉపయోగపడుతుంది.

దేవుని కన్నా డబ్బుకు దాసోహం అయిన ఒక మనిషి గురించిన ఉపమానమును యేసు ఒకసారి చెప్పియున్నాడు,

> మరియు ఆయన వారితో ఒక ఉపమానము చెప్పెను - మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను. మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను - ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు - నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తానాలోచించుకొని - నేనీలాగు చేతును; నా కొట్లు విప్పి, వాటికంటె గొప్పవాటిని కట్టించి, అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తినిసమకూర్చుకొని నా ప్రాణముతో - ప్రాణమా, అనేక సంవత్సరములకు, విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది, సుఖించుము, తినుము, త్రాగుము,

సంతోషించుమని చెప్పుకొందునను కొనెను. అయితే దేవుడు - వెఱ్ఱివాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నాను; నీవు సిద్ధపరచినవి ఎవని వగునని అతనితో చెప్పెను. దేవునియెడల ధనవంతుడు కాక తనకొరకే సమకూర్చుకొనువాడు అలాగుననే యుండునని చెప్పెను (లూకా 12:16-21).

యేసు ఈ ధనికుడిని ఒక వెఱ్ఱివానిగా అభివర్ణిస్తున్నాడు. ఇతడు మంచి ఆరోగ్యమును, సారవంతమైన భూమిని మరియు వ్యవసాయపు నైపుణ్యము కలిగి వుండినప్పటికీ దేవుడిని ఎరుగకవుండెను, లేనిచో అతడు తన విస్తారమైన ధాన్యమును ఆస్తిని కొట్లలో సమకూర్చుకొని ఉండే వాడు కాదు మరియు స్వార్థపూరితమైన సుఖసంతోషాలతో గడిపివుండేవాడుకాదు. దానికి భిన్నంగా తాను కేవలం దేవుని గృహనిర్వాహకుడినని భావించి తనకివ్వబడిన యీవులతో తానేమి చేయవలెను అని దేవుని దగ్గర కనిపెట్టివుండేవాడు. దేవుడు, ఖచ్చితంగా అతని కున్న సమృద్ధిలోనుండి ఇతరులకు పంచి పెట్టాలని మరియు పనిని కొనసాగించమని కోరివుండేవాడు, అందువలన అతను తనకున్నది పంచిపెట్టగలుగుతూ ఉండేవాడు. ఒకవేళ దేవుడు అతనిని పిలిచినచో, బహుశా అతను సమ్మతించే ఒకేఒక ప్రత్యామ్నాయం ఉండేది; అదిఏమిటనగా వ్యవసాయం మానేసి తన పరిచర్యలో తనకు తాను సహకరించుకుంటూ అంకితభావంతో ఉండటం.

యేసు చెప్పిన ఉపమానములో ఆ ధనికుడైన రైతు తను మరణించే తేదీ గురించి తప్పుడు లెక్కను వేసుకున్నాడు. నిత్యత్వానికి కొద్ది గంటలు దగ్గరలో వుండినప్పటికీ తాను ఇంకా ఎన్నో సంవత్సరాలు బ్రదుకుతానని అతడు భ్రమపడ్డాడు. యేసు చెప్పిన దాంట్లో పొరపాటు లేదు: దేవుని యెదుట నిలబడి లెక్కచెప్పటానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటూ, ఇదే మన ఆఖరి రోజని అనుకొనుచూ సిద్ధమనస్కులై జీవించాలి.

## రెండు దృక్పథములు

మానవుని కంటే దేవుని దృక్పథములో ఎంత తేడా! యేసు చెప్పిన ఉపమానములో ఆ ధనికుడైన రైతును చూసి అందరూ అసూయపడేవారు కాని దేవుడు అతనిని చూసి జాలిపడ్డాడు. మనుష్యుల దృష్టిలో అతను గొప్పవాడు, కాని దేవుని దృష్టిలో అతడు పేదవాడు. పరలోకములో శాశ్వతమైన ధనమును సమకూర్చుకోవలసింది పోయి, ఈ లోకములో తన మరణానంతరము అతనికి ఎంత మాత్రము ఉపయోగపడని ధనమును సమకూర్చుకున్నాడు. అత్యాశ కలిగిన ప్రజల గురించి యేసు చెప్పిన ప్రకారంగా ఆ ధనికుడు చనిపోయాక పరలోకం వెళ్తాడని మనం భావించకూడదన్నది యేసు ఉద్దేశ్యం.

మనము ఏది పొందిన అది దేవుని నుంచి వచ్చిన బహుమానమని ఈ ఉపమానం మనకు గుర్తుచేస్తున్నది, మరియు మనము నమ్మకమైన గృహనిర్వాహకులుగా ఉండాలని ఆయన ఆశిస్తున్నాడు. ఇది కేవలం ధనవంతుల గురించే కాదుకాని, ఎవరైతే ఈ భౌతికమైన ఆస్తిపాస్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారో వారందరికి ఇది వర్తిస్తుంది. ఆయన తన శిష్యులతో

మాట్లాడుతున్నప్పుడు దీనిని స్పష్టంగా చెప్పాడు:

> అంతట ఆయన తన శిష్యులతో ఇట్లనెను (అనగా ఆయన ఏమి చెప్పబోతున్నాడో అది ఇప్పుడు ఆయన చెప్పిన దాని మీద ఆధారపడి ఉంది) ఏమి తిందుమో, అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో, అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి. ఆహారముకంటె ప్రాణమును వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా? కాకుల సంగతి విచారించి చూడుడి. అవి విత్తవు, కోయవు, వాటికి గరిసెలేదు, కొట్టులేదు; అయినను దేవుడు వాటిని పోషించుచున్నాడు; మీరు పక్షులకంటె ఎంతో శ్రేష్టులు. మరియు మీలో ఎవడు చింతించుటవలన తన యెత్తును మూరెడెక్కువ చేసికొనగలడు? కాబట్టి అన్నిటికంటె తక్కువైనవి మీచేత కాకపోతే తక్కిన వాటిని గూర్చి మీరు చింతింపనేల? పువ్వులేలాగు ఎదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, వడుకవు; అయినను తన సమస్తవైభవముతో కూడిన సొలొమోను సయితము వీటిలో ఒకదానివలెనైన అలంకరింపబడలేదని మీతో చెప్పుచున్నాను. నేడు పొలములో ఉండి, రేపు పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి ఎంతో నిశ్చయముగా వస్త్రములనిచ్చును. ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, అని విచారింపకుడి, అనుమానము కలిగియుండకుడి. ఈ లోకపు జనులు వీటన్నిటిని వెదకుదురు, ఇవి మీకు కావలసియున్నవని మీ తండ్రికి తెలియును. మీరైతే ఆయన రాజ్యమును వెదకుడి; దానితోకూడ ఇవి మీ కనుగ్రహింపబడును. చిన్న మందా భయపడకుడి, మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీ తండ్రికి ఇష్టమైయున్నది.
>
> మీకు కలిగినవాటిని అమ్మి ధర్మము చేయుడి, పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపాదించుకొనుడి; అక్కడికి దొంగరాడు; చిమ్మెటకొట్టదు. మీ ధనమెక్కడ ఉండునో అక్కడనే మీ హృదయము ఉండును (లూకా 12:22-34).

నేటి "ధనికులైన ప్రసంగీకులు" చెప్పిన మాటలకు యేసు మాటలు ఎంతో విరుద్ధంగా ఉన్నాయి! మనము ఇంకా ఎక్కువగా కలిగి ఉండాలన్నది దేవుని ఉద్దేశ్యమని వారు చెబుతూ ఉంటారు. కాని యేసు తన శిష్యులతో, వారికి ఉన్న సమస్తమును అమ్మివేసి దానధర్మము చేయమని చెప్పాడు! భూమిమీద సంపదను సమకూర్చుకొను వారి వెఱ్ఱితనాన్ని గూర్చి యేసు తిరిగి చెబుతూ-- ఇక్కడ వారు సమకూర్చుకున్న ధనమంతా నాశనమవుతుంది

వారి ధనమెక్కడ ఉండునో అక్కడనే వారి హృదయాలు ఉంటాయి అని చెబుతున్నాడు.

ఆహారం మరియు వస్త్రముల గురించి శోధనలు ఎదుర్కొంటున్న పేదవారికి, యేసు ఈ ధనికుడైన వెఱ్ఱివాడి గురించిన పాఠం వారికి వర్తించేలా చెప్పాడని మనం గ్రహించాలి. వీటిని గూర్చి చింతించటం అనేది మన ఆలోచనధోరణి తప్పని చూపిస్తోంది. మన గురించి శ్రద్ధవహిస్తున్న తండ్రిని గనుక మనం నమ్మినట్లయితే మనం చింతించ నఖరలేదు మరియు ఆ చింతలేని వైఖరి మనలను దేవుని రాజ్యనిర్మాణమును దృష్టించుటకు నడిపిస్తుంది.

## క్రీస్తు యొక్క ఉదాహరణ

డబ్బు గురించి ఇంకా అనేక విషయాలు యేసు చెప్పాడు. శిష్యులను చేసే సేవకుడు చేయునట్లుగా, తన ఉదాహరణ ద్వారా బోధించాడు. ఆయన ఏమి చెప్పాడో అదే చేశాడు. యేసు ఏవిధంగా జీవించాడు?

యేసు తన పరిస్థితిని సులభంగా వినియోగించుకొని మిక్కిలి ధనవంతుడిగా అవటానికి అవకాశం ఉండినప్పటికీ ఈ లోక సంపదను సమకూర్చుకోలేదు. తలాంతులను కలిగిన సేవకులకు తమ పరిచర్య ద్వారా డబ్బులు మెండుగా వస్తున్నట్లయితే, తాము వ్యక్తిగతంగా ధనవంతులుగా ఉండాలన్నది దేవుని ఉద్దేశ్యం అని భావిస్తు తప్పుడు అభిప్రాయాన్ని కలిగివుంటారు. కాని వ్యక్తిగతమైన లాభము కోసం యేసు తన అభిషేకమును వాడుకోలేదు. తనకు ఇవ్వబడిన డబ్బును శిష్యులను చేయుటకు వినియోగించాడు. ఆయనతో ప్రయాణిస్తున్న తన శిష్యుల యొక్క అవసరతలను తీర్చాడు.[100] నేటి దినాల్లో యౌవనస్థులైన శిష్యులు బైబిలు పాఠశాలలోని వేద పండితుల దగ్గర విద్యనభ్యసించటానికి డబ్బు కట్టాలి. కాని యేసు దీనికి సరిగ్గా వ్యతిరేకమైన మాదిరి చూపెట్టాడు!

యేసు కూడా విశ్వాసము మీద ఆధారపడి జీవిస్తూ తన తండ్రి తన అవసరతలన్ని తీరుస్తూ తనను దీవిస్తాడు కనుక తాను కూడా ఇతరుల అవసరతలు తీర్చగలను అని విశ్వసించాడు. కొన్నిసార్లు ఆయన విందుకు ఆహ్వానించబడ్డాడు, మరికొన్ని సార్లు పంటచేలలోని పచ్చి వెన్నులు త్రుంచి తినటం చేశాడు, అది మనం (లూకా 6:1)లో చూస్తాం.

తన మాటలు వినటానికి వచ్చిన వేలాది జనులకు ఆయన ఆహారం పెట్టటం రెండు సందర్భాల్లో చూస్తాము. ఇది ఈనాటి క్రైస్తవ కూటాలలో ఎంత భిన్నంగా ఉంది, ఇక్కడైతే సభలకు హాజరయ్యే ప్రజలు ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుంది! మన సభలకు హాజరయ్యే జనులకు మనం ఉచిత భోజనం పెడుతున్నప్పుడు అది చూసి, "మన ప్రసంగాలు వినటానికి ప్రజలకు పారితోషికం చెల్లిస్తున్నాం" అని అంటూ ఇతరులు మనలను ఎగతాళి చేస్తుంటారు. వాస్తవంగా మనం యేసు మాదిరిని అవలంభిస్తున్నాము.

---

[100] యేసు యొక్క పరిచర్య అభివృద్ధికరముగా ఉన్నదని నిరూపించటానికి ధనికులైన ప్రసంగీకులు తరచుగా ఈ విషయాన్ని వాడుతారు. దేవుడు యేసు యొక్క అవసరతలను తీర్చాడు కనుకనే ఆయన తన పరిచర్యను పూర్తిచేయగలిగాడు అన్న దాంట్లో సందేహమే లేదు. యేసు మరియు ధనికులైన ప్రసంగీకులకు మధ్య ఉన్న తేడా ఏమిటంటే యేసు స్వార్థపరుడు కాడు మరియు ఆయన పరిచర్య యొక్క డబ్బును తన వ్యక్తిగతమైన అభివృద్ధికి వాడుకోలేదు.

యేసు పేదవారిపట్ల కనికరము కలిగి ఉన్నాడు అని చెప్పవచ్చు, ఎందుకనగా ఆయన శిష్యులు డబ్బును పోగుచేసి అందులోనుంచి అవసరతలో ఉన్న వారికి పంచి ఇచ్చేవారు. యేసు పరిచర్యలో పేదవారికి సహాయం చేయడం ఒక క్రమబద్ధంగా జరుగుతూ వచ్చింది, యేసు యూదాతో నీవు చేయునది త్వరగా చేయుమని సెలవిచ్చినప్పుడు, అతడు అక్కడి నుండి నిష్క్రమించటం చూసి ఇతర శిష్యులు, పండుగకు తమకు కావలసినవాటిని కొనుమని యైనను, బీదలకేమైన ఇమ్మనియైనను యేసు అతనితో చెప్పెనేమో అని భావించిరి (యోహాను 13:27-30 చూడుము).

యేసు తనవలె తన పొరుగువారిని ప్రేమించెను గనుక ఆయన చాలా నిరాడంబరంగా జీవిస్తూ తనకున్నదాంట్లో ఇతరులకు పంచి ఇస్తూవచ్చాడు. బాప్తిస్మమిచ్చు యోహాను, "రెండు అంగీలు కలవాడు ఏమియు లేనివానికియ్యవలెను" (లూకా 3:11) అని చెప్పినప్పుడు, ఆయన మాటలకు యేసు పశ్చాత్తాపం చెందనవసరం లేకుండెను. ఎందుకనగా యేసు కేవలం ఒకేఒక అంగీని కలిగియుండెను. అయినను కొంతమంది భాగ్యవంతులైన ప్రసంగీకులు, యేసు భాగ్యవంతుడై ఉంటాడు ఎందుకంటే ఆయన కుట్టులేక పైనుండి యావత్తు నేయబడిన అంగీని ధరించి ఉన్నాడు కనుక, అని చెబుతూ మనలను ఒప్పించటానికి ప్రయత్నిస్తూ ఉంటారు (యోహాను 19:23), ఎందుకంటే అటువంటిది సాధారణంగా కేవలం ధనికులు మాత్రమే ధరిస్తూ ఉంటారు కాబట్టి వారు ఆవిధంగా తలంచి ఉండవచ్చు. బైబిల్లోని అనేక లేఖనములకు వ్యతిరేకముగా ఉన్నది ఏదో దానిని రుజువుచేయవలనెనని ఎవరైన తలించినట్లయితే అది బైబిల్లో కనబడినప్పుడు ఆశ్చర్యమేస్తుంది! యేసు కుట్టులేని అంగీని **పై** వస్త్రముగా ధరించలేదు కనుక ఆయన తను భాగ్యవంతుడన్న విషయం ***దాచి*** ఉంచటానికి ప్రయత్నించాడు అన్న అసంగతమైన తప్పుడు అభిప్రాయానికి మనం రావచ్చు.

ధనమును గురించి యేసు ఇంకా అనేక విషయాలు చెప్పి ఉన్నాడు, కాని వాటి గురించి సమగ్రంగా వివరించుటకు ఇక్కడ చోటు లేదు. అయినను, లేఖనములను వక్రీకరించటములో నైపుణ్యము కలిగి ప్రజలను సులభంగా మోసం చేస్తున్న నేటి భాగ్యవంతులైన ప్రసంగీకులు చెప్పిన కొన్ని సాధారణమైన బోధలను పరిశీలిద్దాం.

## "సొలొమోనును దేవుడు ధనికుడిగా చేసెను"

అనేకమంది భాగ్యవంతులైన ప్రసంగీకులు తమ అత్యాశలను బైటికి కనబడనివ్వకుండా ఇది చెప్పి సమర్థించుకుంటూ ఉంటారు. కాని దేవుడు సొలొమోనుకు ఒక ఉద్దేశ్యం నిమిత్తం ఆ ఐశ్వర్యం ఇచ్చాడు అన్నది వారు మరచిపోతున్నారు. ఆ కారణం ఏదనగా, సొలొమోను ఏది అడిగినను అనుగ్రహిస్తానని దేవుడు వాగ్దానం చేసినప్పుడు, సొలొమోను తన ప్రజలను ఏలుటకు జ్ఞానమివ్వమని అడగగా, అతను ఐశ్వర్యము కొరకు అడగనందుకు దేవుడు ఎంతో సంతోషించాడు కనుక జ్ఞానముతో పాటు ఐశ్వర్యమును కూడా అతనికి అనుగ్రహించాడు. దేవుడు ఉద్దేశించినరీతిలో సొలొమోను ఆ దైవిక జ్ఞానమును వాడలేదు ఫలితంగా ఇదివరకు ఎవ్వరూ లేనంత బుద్ధిహీనుడిగా మారాడు. అతడు జ్ఞానవంతుడైనచో, తను పుట్టకముందు

ఎంతో కాలం క్రితం ఇశ్రాయేలులకు దేవుడిచ్చిన ధర్మశాస్త్రములో ఆయన ఏమిచెప్పాడో దానిని లక్ష్యపెట్టేవాడు:

> నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమున నీవు ప్రవేశించి దాని స్వాధీనపరచుకొని అందులో నివసించి - నా చుట్టునున్న సమస్త జనమువలె నా మీద రాజును నియమించుకొందుననుకొనిన యెడల, నీ దేవుడైన యెహోవా ఏర్పరచువానిని అవశ్యముగా నీమీద రాజుగా నియమించు కొనవలెను. నీ సహోదరులలోనే ఒకని నీమీద రాజుగా నియ మించుకొనవలెను. నీ సహోదరుడు కాని అన్యుని నీమీద నియమించుకొనకూడదు. అతడు గుఱ్ఱములను విస్తారముగా సంపాదించు కొనవలదు, తాను గుఱ్ఱములను హెచ్చుగా సంపాదించుటకు గాను జనులను ఐగుప్తునకు తిరిగి వెళ్లనియ్యకూడదు; ఏలయనగా యెహోవా- ఇకమీదట మీరు ఈ త్రోవను వెళ్లకూడదని మీతో చెప్పెను. తన హృదయము తొలగిపోకుండునట్లు అతడు అనేక స్త్రీలను వివాహము చేసికొనకూడదు; వెండి బంగారములను అతడు తనకొరకు బహుగా విస్తరింపచేసికొనకూడదు (ద్వితీ 17:14-17).

బాగ్యవంతులైన ప్రసంగీకులు ఎప్పుడూ పట్టించుకోని మరొక లేఖనభాగం ఇక్కడ ఉన్నది, సొలొమోను మహారాజు కూడా దీనిని విస్మరించి తనకు తాను నష్టపోయాడు, ఆయనను వీరు అనుకరిస్తున్నారు. ఆయన లాగ వీరు కూడా విగ్రహారాధికులవుతున్నారు. తనకున్న అనేకమంది భార్యల మాటలు విని విగ్రహారాధన చేసేటంతగా అతని హృదయం పక్కదోవపట్టిన విషయం గుర్తుచేసుకోండి. తనకున్న ఐశ్వర్యాన్ని దుర్వినియోగ పరుస్తూ అతను అంతమంది భార్యలను సొంతం చేసుకోగలిగాడు.

సొలొమోను తనవలె తన పొరుగువారిని ప్రేమించి వారికి సహాయపడవలెనన్న ఉద్దేశ్యంతో దేవుడు అతనికి అంత గొప్ప సిరిసంపదలను ఇచ్చాడు, కాని అతను తనమీద తనకు ఉన్న ప్రేమచేత తనకొరకే దానిని వినియోగించాడు. అతను దేవుని ఆజ్ఞను ఉల్లంఘిస్తూ తనకొరకు, బంగారు, వెండి, గుఱ్ఱములను మరియు భార్యలను విస్తారంగా సంపాదించుకున్నాడు. అతడు తుదకు ఏడువందల మంది స్త్రీలను వివాహమాడి, మూడువందల మంది ఉంపుడుగత్తెలను కలిగి ఉండియు, ఇతరుల భార్యలను దాదాపు వేయి మందిని బలత్కారముగా దొంగిలించాడు. పేదలకు సహాయం చేసేది పోనిచ్చి అతడు హద్దుమీరి తనమనస్సుకు తోచినట్లు నడుచుకున్నాడు. ఈ భాగ్యవంతులైన ప్రసంగీకులు నేటి క్రొత్తనిబంధన క్రైస్తవులకు సొలొమోను మహారాజును అతని యొక్క స్వార్థము మరియు అతని నీచమైన విగ్రహారాధనను యెరిగియు అతనిని ఒక మాదిరిగా ప్రజలకు ఎత్తిచూపటం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ***క్రీస్తు***ను పోలి నడుచుకోవటం అన్నది మన లక్ష్యం కాదా?

## “దేవుడు అబ్రాహామును ధనికుడిగా చేశాడు మరియు అబ్రాహాము యొక్క దీవెనలు మనకు కూడా వాగ్దానం చేయబడ్డాయి”

గలతీ 3వ అధ్యాయములో వ్రాయబడిన పౌలు మాటలలో ఇది వివరించబడింది. తరచూ తప్పుగా ఉదహరించబడిన ఆ వాక్యాన్ని నేను ఇక్కడ ఉదహరిస్తున్నాను కాని సందర్భానుసారంగానే

> దేవుడు విశ్వాసమూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగాచూచి- “నీయందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురు” అని అబ్రాహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను. ***కాబట్టి విశ్వాససంబంధులే విశ్వాసముగల అబ్రాహాముతో కూడ ఆశీర్వదింపబడుదురు***. ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు ఎందుకనగా- ధర్మశాస్త్రగ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది. ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడుడను సంగతి స్పష్టమే. ఎలయనగా - నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును. ధర్మశాస్త్రము విశ్వాససంబంధమైనది కాదు గాని దాని విధులను ఆచరించువాడు వాటివలననే జీవించును ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు ***అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తు యేసు ద్వారా అన్యజనులకు కలుగుటకై***, క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను; ఇందును గూర్చి మ్రాను మీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది (గలతీ 3:8-14).

14వ వచనంలో పౌలు వ్రాసిన “అబ్రాహాము పొందిన ఆశీర్వచనం” అనెడిది ***అతని యందు*** అన్యజనులందరూ ఆశీర్వదించబడెదరు అని చెబుతూ దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానమది (దీనిని పౌలు 8వ వచనంలో ఉదహరించాడు), లేదా మరి విశేషముగా చెప్పాలంటే, పౌలు కొన్ని వచనముల తర్వాత వివరిస్తున్నట్లుగా ***అబ్రాహాము సంతానమునందు***, అనగా క్రీస్తునందు అన్నమాట (గలతీ 3:16). మనమిప్పుడు చదివిన ప్రకారంగా, యేసు తండ్రి ద్వారా శపించబడి సిలువ మీద ఈ లోక పాపముల కొరకు చనిపోయి, ఆ విధంగా ఆ వాగ్దాన ఆశీర్వాదాన్ని సమస్త జనాంగానికి అనుగ్రహించాడు. గనుక “అన్యుజనులకు సంప్రాప్తించిన అబ్రాహాము యొక్క ఆశీర్వాదము”అనెడిది, దేవుడు వారిని అబ్రాహామువలె ఈ భౌతికపరమైన సిరిసంపదలతో ఆశీర్వదిస్తాడన్న దాని గురించి కాదుగాని, అతని సంతానము ద్వారా అన్యజనులందరనీ ఆశీర్వదిస్తానని అబ్రహామునకు ఇచ్చిన వాగ్దానము గురించి

చెప్పబడింది, ఆ వాగ్దానము, యేసు వారందరి కోసం సిలువపై చనిపోవటం ద్వారా నెరవేర్చబడింది. (ఇక్కడ పౌలు యొక్క భావం ఏమిటంటే, అన్యజనులు యూదులవలె యేసు నందు విశ్వసించుట ద్వారా రక్షింపడతారు అననదియే).

## మరొక వక్రీకరణ

భాగ్యవంతులైన ప్రసంగీకులు తమ సిద్దాంతమును సమర్థించుకొనుటకు ఇదే లేఖనభాగమును మరొక విధంగా ఉపయోగిస్తూవుంటారు. ధర్మశాస్త్రమును పాటించని వారి మీదికి దరిద్రం వస్తుందని వాగ్దానం చేయబడింది కనుక (ద్వితీ 28:30-31, 33, 38-40, 47-48, 51, 68) మరియు, పౌలు "క్రీస్తు మనలను ధర్మశాస్త్రం యొక్క శాపము నుండి విమోచించెను" అని గలతీ 3:13లో వ్రాశాడు గనుక క్రీస్తునందు ఉన్నవారు ఈ ధర్మశాస్త్ర శాపమునుండి విమోచింపబడతారు అని చెబుతూ వారు సమర్థించుకుంటూ ఉంటారు.

మొదటిగా, పౌలు "ధర్మశాస్త్ర శాపము" గురించి వ్రాస్తున్నప్పుడు అతను ద్వితీయోపదేశకాండము 28వ అధ్యాయంలో చెప్పబడిన కొన్ని ప్రత్యేకమైన పాపముల గురించి ఆలోచించివుంటాడనే ఒక వాదన ఉంది. ఆ శాపమునుండే క్రీస్తు మనలను విమోచించాడు. క్రీస్తు మనలను ధర్మశాస్త్ర "పాపముల" (బహువచనం) నుండి విమోచించాడు అని పౌలు చెప్పటం లేదు, కాని ధర్మశాస్త్ర "శాపము" (ఏకవచనం) నుండి అని చెబుతున్నాడు, దర్మశాస్త్రం పాటించటం ద్వారా రక్షణను పొందవచ్చు అని భావించి ఆ దిశగా ప్రయత్నించే వారియెడల ధర్మశాస్త్రమంతయు బహుశ ఒక శాపముగా పరిణమిస్తుంది అన్న భావంతో చెప్పివుండవచ్చు అన్నది గమనించండి. ఒక్కసారి మనం క్రీస్తు ద్వార విమోచింపబడినాక, ధర్మశాస్త్రం పాటించటం ద్వారా మనలను మనం రక్షించుకొనే ప్రయత్నం ఆ పొరపాటు ఇక ఎప్పటికీ చేయము ఎందుకనగా మనం "ధర్మశాస్త్ర శాపం నుండి విమోచించబడినాము."

ద్వితీయోపదేశకాండం 28లో చెప్పబడిన ప్రతి శాపం నుండి క్రీస్తు మనలను విమోచించాడు అని పౌలు వాస్తవంగా చెప్పి ఉన్నట్లయితే, ఆ ప్రకారంగా అది మన భౌతక పరమైన సిరిసంపదల విషయంలో కూడా హామీ ఇస్తున్నది. పౌలు తనను గురించి ఒకసారి ఎందుకు ఆవిధంగా వ్రాశాడు అని ఆశ్చర్యం వేస్తుంది, "ఈ గడియ వరకు ఆకలి దప్పులు గలవారము, దిగంబరులము; పిడిగుద్దులు తినుచున్నాము; నిలువరమైన నివాసములేక యున్నాము" (1 కొరింథీ 4:11). పౌలు ఇలా ఎందుకు వ్రాశాడు అని ఇది చదివితే మనం మరోసారి ఆశ్చర్యపోవాల్సివస్తోంది,

> క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా? ఇందును గూర్చి వ్రాయబడినదేమనగా, నిన్నుబట్టి దినమెల్ల మేము వధింపబడినవారము వధకు సిద్ధమైన గొఱ్ఱెలమని మేము ఎంచబడిన వారము (రోమా 8:35-36).

క్రీస్తు మనలను ధర్మశాస్త్ర శాపం నుండి విమోచించినందు వలన క్రైస్తవులందరూ హింసలు, కరవు, వస్త్రహీనత, ఉపద్రవము, ఖడ్గము బారినుండి తప్పించబడినట్లయితే పౌలు ఈ మాటలు వ్రాసివుండేవాడు కాదు.

ఈ క్రింది వ్రాయబడిన పరలోక దృశ్యాన్ని యేసు ముందుగానే ఎందుకు చెప్పాడా అని ఆశ్చర్యమేస్తుంది,

> అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి-నీ తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి; దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి; దిగంబరినై యుంటిని, నాకు బట్టలిచ్చితిరి; రోగినైయుంటిని, నన్ను చూడవచ్చితిరి; చెరసాలలో ఉంటిని నాయొద్దకు వచ్చితిరి; అందుకు నీతిమంతులు-ప్రభువా, యెప్పుడు నీవు ఆకలిగొని యుండుట చూచి నీకాహారమిచ్చితిమి? నీవు దప్పిగొని యుండట చూచి యెప్పుడు దాహమిచ్చితిమి; ఎప్పుడు పరదేశివై యుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్టలిచ్చితిమి; ఎప్పుడు రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను, చూచి నీయొద్దకు వచ్చితిమి అని ఆయనను అడిగెదరు. అందుకు రాజు-***మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును*** (మత్తయి 25:34-40).

కనుక కొందరు విశ్వాసులు "ధర్మశాస్త్ర శాపమునుండి విమోచింపబడినవారు" బీదరికమైన స్థితిలో ఉంటారు అన్నదాంట్లో సందేహమే లేదు. కాని యేసు వర్ణించిన ఆ కఠినమైన శ్రమలను ఎదుర్కొంటున్న విశ్వాసులను దేవుడు ఎడబాయక వారియొక్క అవసరతలను తీర్చాడని, వారికన్నా ఉన్నతమైన స్థితిగలిగిన వారి ద్వారా ఆయన వారికి ఈ సాయం చేసాడన్నది మనం గమనించాలి. ***మనమెప్పుడూ దేవుడు మన అవసరతలు తీరుస్తాడని అనుకోవాలి, ఇది తాత్కాలికముగా వేరేవిధంగా అగుపించినా సరే ఆయన మన అవసరతలు తప్పక తీరుస్తాడనే నమ్మాలి***.

చివరిగా, అబ్రాహాము వలె ధనికులమవ్వాలని ఆశించే బోధకులు, తమ జీవితకాలమంత కరెంటు లేదా నీటి సౌకర్యం అంటూలేని ఆ గుడారములలో ఉండగలమో లేదో అని తమకు తాము నిజాయితీగా ప్రశ్నించుకోవాలి! పాతనిబంధనలో దేవునిచేత ఆశీర్వదించబడిన వారు తమ సంపదను దేవుని మహిమార్థం వినియోగించాలని, తమకున్న సమృద్ధినుంచి ఇతరులకు పంచాలని, సహాయపడాలని ఆవిధంగా వారుచేయాలని దేవుడు

ఆశించాడు. అబ్రాహాము ఈ విధంగానే చేశాడు, వందలాదిమందికి ఉద్యోగాలు ఇచ్చాడు, అది వారి అవసరతలను తీర్చింది (ఆది 14:14 చూడుము). యోబు కూడా ఈ విధంగానే చేశాడు, విధవరాండ్రకు మరియు అనాథలకు సహాయపడ్డానని సాక్ష్యమిస్తున్నాడు (యోబు 29:12-13, 31:16-22). వ్యాపారములో స్థిరపడిన వారు, దేవునికి విధేయత చూపటం మరియు తమవలె తమ పొరుగువారిని ప్రేమించటం తమ ప్రధాన కర్తవ్యంగా భావించాలి.

## "మనము ధనవంతులము కావలెనని, యేసు దరిద్రుడాయెను అని లేఖనములు చెబుతున్నాయి"

బైబిలు ఈ విధంగా చెబుతోంది:

> మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు కృపను ఎరుగుదురుగదా! ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింథీ 8:9).

యేసు పరలోకములో భౌతికమైన సిరిసంపదలతో తులతూగుతుండగా, ఈ భూమి మీద ఆయన ***భౌతికమైన*** పేదరికమును అనుభవించెను అన్నది ఈ లేఖనము యొక్క గూడార్థం అనియు కాగా పౌలు తన పాఠకులకు క్రీస్తు దారిద్రం ద్వారా వారు ***ధనికులవుతారని*** వ్రాస్తున్నప్పుడు, బహుశా ఈ ***భౌతికమైన సంపదన*** గురించే పౌలు మనస్సులో అనుకొని ఉండవచ్చు అని కొందరు వాదిస్తుంటారు. వారేమంటారంటే ఒకవేళ పౌలు ***ఈలోక*** సంపద మరియు బీదరికం గురించి ఈ వాక్యం యొక్క మొదటి భాగంలో మాట్లాడి ఉంటే, రెండవ భాగంలో ఆయన ***ఆత్మీయ*** సంపద గురించి మాట్లాడి ఉండేవాడు కాదు.

ఒకవేళ పౌలు నిజంగా క్రీస్తు భౌతికమైన పేదరికము వలన మనము భౌతికముగా ధనికులమవుతామని చెప్పి ఉనింటే, ఆయన అదే పత్రికలో కొన్ని వాక్యముల తర్వాత ఇలా ఎందుకు వ్రాసాడా అని మనం ఆశ్చర్యపోవాలి అని,

> ప్రయాసతోను, కష్టముతోను, తరచుగా జాగరణములతోను, ఆకలిదప్పుల తోను, తరచుగా ఉపవాసములతోను, చలితోను, దిగంబరత్వముతోను ఉంటిని. ఇంకను చెప్పవలసినవి అనేకములున్నవి (2 కొరింథీ 11:27).

2 కొరింథీ 8:9లో చెప్పబడినట్లుగా క్రీస్తు భౌతికముగా దరిద్రుడవటం వలన మనము భౌతికముగా ధనవంతులవుతామని పౌలు భావించి ఉండినట్లయితే క్రీస్తు యొక్క ఉద్దేశ్యము పౌలు జీవితములో ఖచ్చితంగా జరిగివుండేది కాదు! కనుక క్రీస్తు భౌతికముగా దరిద్రడవటము వలన మనము ఈ భూమి మీద ధనికులవుతామన్నది పౌలు ఉద్దేశ్యం ***కాదు*** అన్నది స్పష్టమౌతోంది. అనగా యేసు చెప్పినట్లుగా "దేవుని యెడల ధనవంతులం" (లూకా 12:21 చూడుము) అన్నట్లుగా మనము ఆత్మీయముగా ధనికులమవుతామన్నది అతని ఉద్దేశ్యం, మరియు మనం ఎక్కడైతే మన ధనం సమకూర్చుకుంటామో ఎక్కడైతే మన హృదయాలు ఉంటాయో ఆ పరలోకమందే మనం ధనికులమౌతాము.

భాగ్యవంతులైన ప్రసంగీకులు చెబుతున్నట్లుగా పౌలు **భౌతిక** సంపదను గురించి ఈ వాక్యములో ఒక భాగంలో మాట్లాడుతున్నాడు గనుక ఇంకొక భాగంలో **ఆత్మీయ** సంపదను గురించి మాట్లాడుట లేదని అనుకోవడం నిజంగా సబబేనా? స్ముర్న అనేపట్టణములో యేసు తన శిష్యులకు చెప్పిన కొన్ని మాటలను ధ్యానిద్దాం:

> నీ శ్రమను దరిద్రతను నేనెరుగుదును, (అయినను నీవు ధనవంతుడవే)...(ప్రకటన 2:9).

స్ముర్నలో ఉన్న విశ్వాసులు ఎదుర్కొంటున్న **భౌతికమైన** దరిద్రత గురించే యేసు ఇక్కడ స్పష్టముగా మాట్లాడుతున్నాడు, కాని నాలుగు మాటల తర్వాత ఆయన అదే విశ్వాసుల యొక్క **ఆత్మీయ** సంపద గురించి కూడా మాట్లాడారు.

## "మనం ఇచ్చిన దానికి వందరెట్లు వెనక్కు తిరిగి వస్తుందని యేసు వాగ్దానం చేశాడు"

ఎవరైతే కొన్ని త్యాగాలు చేస్తారో వారికి వందరెట్లు తిరిగి వస్తుందని యేసు వాగ్దానం చేశాడు. ఆయన ఏమని చెప్పారో అది ఉన్నది ఉన్నట్లుగా చదువుదాం:

> అందుకు యేసు ఇట్లనెను-నా నిమిత్తము సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మార్కు 10:29-30).

ఎవరైతే ప్రసంగీకులకు డబ్బులిస్తారో వారికి ఈ వాగ్దానం వర్తిస్తుందని భాగ్యవంతులైన బోధకులు అంటుంటారు, కాని ఈ వాగ్దానం వారికి కాదన్న విషయం మనం గమనించాలి. దాని బదులుగా ఎవరైతే వారి గృహములను, పొలములను మరియు బంధువులను వదులు కొని సువార్తను నలుదిశలా ప్రకటిస్తున్నారో వారికి ఈ వాగ్దానం చెందుతుందన్నది మనం గుర్తించాలి. "ప్రస్తుతము ఉన్నదాని కంటే నూరంతలు ఎక్కువగా వస్తుంది" అని అలాంటి మనుష్యులకు యేసు వాగ్దానం చేశాడు.

కాని భాగ్యవంతులైన ప్రసంగీకులు చెప్పినట్లుగా అలాంటి మనుష్యులు నిజంగానే వంద గృహములకు లేక పొలములకు యజమానులౌతారని యేసు వాగ్దానం చేస్తున్నాడా? లేదు! అటువంటి వారు నిజంగానే వందమంది తల్లులను మరియు పిల్లలను పొందుతారు అని ఆవిధంగా ఆయన వాగ్దానాలు చేయలేదు. ఎవరైతే వారి గృహాలను మరియు కుటుంబాలను వదిలివేస్తారో వారిని తోటి విశ్వాసులు తమ గృహములను తెరిచి సొంత కుటుంబములాగా ఆదరిస్తారు అని మాత్రమే యేసు చెబుతున్నాడు.

అటువంటి వారికి యేసు హింసలతోపాటు నిత్యజీవమును కూడా వాగ్దానం చేయటం

గమనించండి. నిత్యజీవం పొందగోరిన గొప్ప ధనికుడైన ఒక యౌవనస్థుడు, యేసు ఈ విధంగా చెప్పాక, "ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుటకంటే ఒంటె సూదిబెజ్జములో దూరుట ఎంతో దుర్లభము" (మార్కు 10:25) అది విని తన ముఖము చిన్నబుచ్చుకొని, దు:ఖపడుతూ వెళ్ళుటమును శిష్యులు చూడటం మొదలగు వివరములతో ఉన్న లేఖన భాగంలోని సందర్భాన్ని ఇది మనకు గుర్తుచేస్తోంది.

యేసు చెప్పిన మాటలకు శిష్యులు విస్మయమొంది, దేవుని రాజ్యములో ప్రవేశించు అవకాశం తమకు కలదా అని ఆశ్చర్యపోయిరి. ఆయనను వెంబడించుటకు తాము సమస్తము విడిచి పెట్టిన సంగతి ఆయనకు గుర్తుచేసిరి. అప్పుడు, యేసు "నూరంతలు" వాగ్దానం గురించి మాట్లాడాడు.

ఇది ఇలా ఉండగా, ఎవరైనా బోధకుడు, యేసు నిజముగానే నూరంతలుగా ఈ భౌతికమైన వస్తుసముదాయమును మనము పొందుతాము అని వాగ్దానం చేస్తున్నాడు, అది మనలను స్వల్పకాలములోనే నమ్మశక్యం కాని భాగ్యవంతులుగా మార్చివేస్తుంది అని చెబుతూ మనలను ఒప్పించటానికి ప్రయత్నిస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. యేసు ఆ ధనికుడితో నిత్యజీవం కావాలంటే నీకు కలిగినవన్నీ అమ్మి బీదలకిమ్ము అని చెబుతుండగా, వీరు ఇలా చెప్పటం ఆశ్చర్యమేస్తోంది.

ఈ బోధకులు ఇప్పుడు మనం పరిశీలించిన విషయమునే కాక ఇంకా అనేక లేఖనములను తమకు అనుకూలముగా వక్రీకరించి చెబుతూంటారు. వాటన్నిటిని ఈ పుస్తకములో వ్రాయుటకు చోటుసరిపోదు. ఇటువంటి బోధకుల విషయములో జాగ్రత్తగా ఉండండి!

## గుర్తుంచుకోదగిన సూక్తి

చర్చ్ ఆఫ్ ఇంగ్లాండులోని మెథడిస్టు ఉద్యమ స్థాపకుడైన జాన్‌వెస్లీ, డబ్బు విషయము లో ఒక సరైన దృక్పథం కలుగుటకు దానికి సంబంధించిన ఒక అద్భుతమైన సూక్తిని కల్పించి చెప్పాడు అది ఏదనగా, "నీవు చేయగలిగినంత చేయి; కూడబెట్టకలిగినంత కూడబెట్టు; ఇవ్వగలిగినంత ఇవ్వు"

అనగా మొదట క్రైస్తవుడు డబ్బుసంపాదించుటకు, దేవుడు తనకిచ్చిన శక్తిసామర్థ్యాలను, అవకాశాలను ఉపయోగించుకుంటూ కష్టపడి పనిచేయాలి. కాని క్రీస్తు ఆజ్ఞలలో ఏదియూ ఉల్లంఘించకుండా నిజాయితితో సంపాదించటానికి జాగ్రత్తపడాలి.

రెండవదిగా, వారు పొదుపుగా, నిరాడంబడరంగా ఉంటూ, సాధ్యమైనంతవరకు తమకొరకు మితంగా ఖర్చుపెట్టుకుంటూ జీవిస్తున్నట్లయితే అది "వారు కూడబెట్టగలిగినంత కూడ బెట్టేలాగా" సహాయపడుతుంది.

చివరిగా, మొదటి రెండు పద్ధతులను అవలంభించాక, అప్పుడు వారు, "ఇవ్వగలిగినంత ఇవ్వగలరు", దశమభాగం ఇచ్చుటలో మితముగా ఉండక సాధ్యమైనంత వరకు తమ్మును తాము ఉపేక్షించుకొందురు. కనుక విధవరాండ్రు మరియు అనాథలు సహాయం పొందుటకు వీలవుతుంది మరియు సువార్త ప్రపంచమంతటా ప్రకటించబడుటకు

సాధ్యపడుతుంది.

ఆది సంఘం అటువంటి గృహ నిర్వాహకత్వాన్ని అవలంభించింది. వారిలో అవసరమైన వారిని ఆదుకోవటం అనేది క్రొత్త నిబంధన జీవితములో సర్వసాదారణ ంగా అగుపడే విషయం. యేసు తన శిష్యులకు ఇచ్చిన ఆదేశం, "మీకు కలిగినవాటిని అమ్మి ధర్మము చేయుడి, పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపాదించుకొనుడి; అక్కడికి దొంగరాడు; చిమ్మెట కొట్టదు. (లూకా 12:33)ను ఆ మొదటి విశ్వాసులు స్వీకరించి దానిని నిజంగానే చేసి చూపించారు. ఆ సంఘం గురించి లూకా వ్రాసిన నివేదికను మనం చదువుదాం,

> విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి... విశ్వసించినవారందరును ఏక హృదయమును ఏకాత్మయుగలవారై యుండిరి. ఎవడును తమకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు; వారికి కలిగినదంతయు వారికి సమష్టిగా ఉండెను. ఇదియుగాక అపొస్తలులు బహు బలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చిరి. దైవకృప అందరియందు అధికముగా ఉండెను. భూములైనను ఇండ్లయినను కలిగినవారందరు వాటిని అమ్మి, అమ్మిన వాటి వెల తెచ్చి అపొస్తలుల పాదములయొద్ద పెట్టుచువచ్చిరి. వారు ప్రతివానికి వాని వాని అక్కరకొలది పంచిపెట్టిరి గనుక వారిలో ఎవనికిని కొదవలేకపోయెను (అపొ 2:44-45; 4:32-35).

ఆది సంఘం పేద విధవ రాండ్రకు, ఆహారం పంచిపెట్టడం మరియు వారి అత్యవసరతలను తీర్చటం వంటివి చేసిందని లేఖనం స్పష్టంచేసింది (అపొ 6:1; 1 తిమోతి 5:3-10 చూడుము).

అపొస్తలులలో గొప్పవాడు, అన్యులకు సువార్త ప్రకటించుటకు దేవుని చేత పంపబడిన వాడు, క్రొత్తనిబంధనలోని ఎక్కువ పత్రికలను వ్రాసిన గ్రంథకర్త అయిన పౌలు పేదవారి అవసరత తీర్చటం తన పరిచర్యలో అతి ముఖ్యమైన భాగమని భావించాడు. తను స్థాపించిన సంఘాల్లోని పేద క్రైస్తవులకొరకు పౌలు పెద్దమొత్తంలో డబ్బులు సేకరించాడు (అపొ 11:27-30; 24:17; రోమా 15:25-28; 1 కొరింథీ 16:1-4; 2 కొరింథీ 8-9; గలతీ 2:10 చూడుము). తను మారిన 17 సంవత్సరముల తరువాత పౌలు తాను పొందిన సువార్తను పేతురు, యాకోబు, యోహానులు పరిశీలించుట కొరకు దానిని వారికి సమర్పించేందుకు యెరూషలేమునకు బయలుదేరాడు. అతను చెప్పిన సందేశములో ఒక్క తప్పును కూడా వారిలో ఎవ్వరూ కనుగొనలేకపోయిరి. పౌలు గలతీయులకు వ్రాసిన పత్రికలో ఆ సందర్భాన్ని

గుర్తుచేసుకొని తిరిగి ఇలా వివరిస్తున్నాడు, “మేము బీదలను జ్ఞాపకము చేసికొనవలెనని మాత్రమే వారు కోరిరి; ఆలాగు చేయుటకు నేనును ఆసక్తి కలిగియుంటిని.” పేతురు, యాకోబు, యోహాను మరియు పౌలు మనస్సులలో పేదవారిపట్ల వారికున్న కనికరము సువార్త ప్రకటన తరువాత రెండవ స్థానములో నిలిచింది.

## తుది సారాంశము

ఈ అంశము మీద అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన ఉత్తరం ద్వారా శిష్యులను చేయు బోధకుడికి ఉత్తమ సలహా ఇవ్వబడుతోంది. అతను తిమోతిని “ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము” అని హెచ్చరించిన తరువాత, ఇలా చెబుతూ, “కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి” అని చెప్పి, ఆ తరువాత ఈ విధంగా హితబోధ చేశాడు,

> దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి, నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము (1 తిమోతి 6:11).

